క్లుప్తంగా

ఘనంగా రథోత్సవం



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండరామస్వామి ఆలయం వద్ద శుక్రవారం అర్ధరాత్రి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములోరికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని కోదండ రామస్వామి ఆలయం నుంచి భక్తులు ఎదురుగా ఉన్న దిగదీర్పతి వరకు లాగుతూ తిరిగి ఆలయం ముందుకు తీసుకొచ్చారు. రథోత్సవాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో ఇటీవల ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందిన నౌసోళ్ల చంద్రమ్మ కుటుంబాన్ని శనివారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. సీపీఐ పార్టీ బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డంగు కుర్మయ్య, పెంటయ్య, పెద్ద హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ఓ వైన్ షాపు నుంచి వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామానికి కార్తీక్ శనివారం మధ్యాహ్నం 17లీటర్ల మద్యం తరలిస్తుండగా సాయిరాం ఫంక్షన్ హాల్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. దీని విలువ రూ.7,300 ఉంటుందని పోలీసులు తెలిపారు. మద్యం అక్రమంగా తరలిస్తుండడంతో సీజ్ చేసి కార్తీక్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

22న బీఆర్‌ఎస్ సమావేశం

అమరచింత: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 22న ఆత్మకూర్ పట్టణంలో అమరచింత, ఆత్మకూర్ ఉమ్మడి మండల బీఆర్‌ఎస్ సమావేశానికి కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్‌సింగ్ ఇంట్లో మండల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్‌ఎస్ తరఫున బరిలోకి దిగిన మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం సైనికులుగా పనిచేయాలన్నారు. బీఆర్‌ఎస్‌లో ఉంటూ పదవులు అనుభవించి నేడు పార్టీ వీడుతున్న వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని, భవిష్యత్తు బీఆర్‌ఎస్‌దే అన్న విషయం వెళ్లిన వారికి తెలిసే రోజు వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజేందర్ సింగ్, మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, మార్కెట్ మాజీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్, పట్టణ ఉపాధ్యక్షుడు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దావత్ పేరుతో వసూళ్లు.. ఎమ్మెల్యే ఆగ్రహం

వనపర్తి: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో కొన్ని నెలల క్రితం తాగునీటి కోసం ఎమ్మెల్యే బోరు తవ్వించిన విషయం తెలిసిందే. ఇటీవల బోరుకు మోటార్ బిగించిన కాలనీ కాంగ్రెస్ నాయకులు కొందరు బోరు వేసిన సందర్భంగా కాలనీలో దావత్ చేయాలంటూ.. ఇంటికి రూ.1500ల చొప్పున కొందరి వద్ద వసూలు చేశారు. విషయం ఆ ప్రాంత కౌన్సిలర్‌కు తెలియడంతో దావత్ పేరుతో కాలనీవాసులతో డబ్బులు వసూలు చేయటం సరికాదన్నారు. తన సొంత ఖర్చుతో బోరు మోటార్ ప్రారంభానికి ఏర్పాటు చేస్తానని, కాలనీవాసులకు డబ్బులు తిరిగి ఇచ్చేయాలని నాయకులకు కోరారు. ఈ విషయం నాయకుల ద్వారా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి తెలియటంతో కాలనీవాసులతో వసూళ్లకు పాల్పడిన సొంత పార్టీ నాయకులను గట్టిగా మందలించారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృత్తం కావొద్దని హెచ్చరించినట్లు తెలిసింది.

పేకాట స్థావరంపై దాడి

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధిన్నెలో శనివారం రాత్రి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నందీకర్ తెలిపారు. పేకాట రాయుళ్ల నుంచి రూ.33వేల నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

నిర్మాణం పూర్తయ్యేనా?



గోపాల్‌పేట మండల శివారులో కొనసాగుతున్న డ్రాపింగ్ పనులు (ఫైల్)

- వర్షాకాలంలో తెగిపోతున్న సాగునీటి కాల్వలు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని నిర్మాణాలు
- వేగంగా పూర్తి చేయాలని రైతుల వినతి

గోపాల్‌పేట: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ప్రధాన కాల్వకు తూడుకుర్తి సమీపంలో డీ–8 కాల్వ ఏర్పాటు చేసి మండలంలో రైతులకు ఏడేళ్ల క్రితం నీటిని వదిలారు. గోపాల్‌పేట మండలంలో సుమారు 16 కిలోమీటర్లు కాల్వలు నిర్మించారు. కానీ కాల్వలకు స్ట్రక్చర్లు, ఎస్ఎల్ఆర్బీలు (సింగిల్ లైన్ రోడ్ బ్రిడ్జి), డీఎల్ఆర్బీలు (డబుల్ లైన్‌రోడ్ బ్రిడ్జి)లు అన్నీ కలిపి మొత్తం 120 పైగా స్ట్రక్చర్లు నిర్మాణం చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు కొన్నింటినే నిర్మించి వదిలేశారు. కాల్వకు మొత్తం స్ట్రక్చర్లు పూర్తి చేస్తే మండలంలో సుమారు పదివేల ఎకరాలకు సాగునీరందుతుంది. కాల్వ వెంబడి స్ట్రక్చర్లు సరిగా ఏర్పాటు చేయకపోవడంతో వర్షాకాలంలో కాల్వల వెంట నీరు వచ్చినప్పుడు కాల్వ కట్టలు తెగిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

కాంట్రాక్టర్లపై అధికారులు, నాయకులు ఎన్నిసార్లు ఒత్తిడి చేసినా పనులు చేయనని చేతులెత్తేశాడు. ప్రస్తుతం అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఒప్పించడంతో పనులు కొనసాగుతున్నాయి. రాంరెడ్డిపల్లితండా వద్ద పనులు డ్రాపింగ్ పనులు కొనసాగుతున్నాయి.

రైతులకు ప్రయోజనం

మండలంలో డీ–8 కాల్వ ద్వారా ప్రస్తుతం సుమారు పదివేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. గోపాల్‌పేట మండలంలో మేజర్ 1 కాల్వ ద్వారా కేశంపేట, చెన్నారం వైపు సాగవుతోంది. మేజర్ 2 కాల్వ ద్వారా ఏదుట్ల, గోపాల్‌పేట ప్రాంతాలకు నీరు వెళ్తోంది. మేజర్ 3 పనులు పూర్తి కాలేదు. మేజర్ 3ఏ ద్వారా మున్ననూరు, తిర్మలాపూర్ మీదుగా వనపర్తి వెళ్తున్నాయి. గతంలో కాల్వలపై బ్యాంకింగ్‌లు, స్ట్రక్చర్లు సరిగా నిర్మించకుండా వదిలేయడంతో ప్రతి వర్షాకాలంలో చాకల్‌పల్లి, గోపాల్‌పేట మండల శివార్లలో నీరు ఎక్కువగా వచ్చి కట్టలమీదుగా నీరుపారి కాల్వలు తెగిపోయాయి. గతేడాది చాకల్‌పల్లి సమీపంలో, రెండేళ్ల క్రితం గోపాల్‌పేట శివారులో రెండుసార్లు కట్ట తెగిపోయింది. దీంతో స్థానికంగా ఉండే రైతుల పంట పొలాల్లోకి నీరు చేరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎండాకాలం పూర్తి అయ్యేలోపు స్ట్రక్చర్లు, డ్రాపింగ్‌లు, ఎస్ఎల్ఆర్బీలు, డీఎల్ఆర్బీలు పూర్తిచేసి వచ్చే వర్షాకాలం వరకు పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

పనులు కొనసాగుతున్నాయి

ప్రస్తుతం గోపాల్‌పేట మండలంలోని చాకల్‌పల్లి సమీపంలోని రాంరెడ్డిపల్లి సమీపంలో స్ట్రక్చర్లు, ఎస్ఎల్ఆర్బీలు, డీఎల్ఆర్బీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గుత్తేదారుకు మాట్లాడి పనులు ప్రారంభించాం. రాబోయే వర్షాకాలం లోపు అన్ని మండలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించాం. తొందరగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– వెంకటరమణమ్మ, డీఈ, నీటిపారుదల శాఖ

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



నీటిలోని ధాన్యాన్ని కుప్ప చేస్తున్న మహిళ



తడిసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌తో కుప్పచేస్తున్న రైతు

పెబ్బేరు రూరల్: అకాల వర్షం అన్నదాతను ఆగం చేసింది. వనపర్తి మండలంలో చిట్యాల మార్కెట్ యార్డుకు పలు గ్రామాల నుంచి రైతులు ధాన్యం తీసుకొచ్చి అక్కడే ఆరబోశారు. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన వానతో ధాన్యం కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు వర్షంలో ఎన్నో అవస్థలు పడ్డారు. అకాల వర్షానికి దాదాపు 2వేల బస్తాల ధాన్యం తడిసిపోయింది. ధాన్యం నీటిలో కొట్టుకుపోకుండా కుప్ప చేస్తూ.. కవర్లు కప్పేందుకు రైతులు ప్రయత్నించారు. కానీ, వర్షపు నీరు నేలపై నుంచి రావడంతో ధాన్యం ఎక్కువగా తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

కొనుగోలు చేయాలి

అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి. మార్కెట్‌లో రైతులకు టార్పాలిన్ కవర్లు అందజేయాలి.

– రామకృష్ణ, రైతు రాజనగరం

మద్దతు ధర చెల్లించాలి

పండించిన ధాన్యం మార్కెట్ యార్డుకు తీసుకొచ్చాం. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. మార్కెట్ యార్డులో సీసీ సక్రమంగా లేక గుంతల్లో నీళ్లు నిలిచాయి. ఏమి చేయాలో తోచడంలేదు. ప్రభుత్వమే తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. ముందే కొనుగోలు చేసి ఉంటే ఈ ఇక్కట్లు తప్పేవి.

– లక్ష్మి, చిట్యాల

లక్ష్మీనరసింహ యోగానంద స్వామి ఉత్సవాలు



దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో వెలిసిన శ్రీమత్ దత్తాత్రేయ పీఠ సంవర్ధిత శ్రీరామ అవధూత శ్రీలక్ష్మీ నరసింహ యోగానంద స్వామి 125వ ఆరాధన సహిత సప్తాహ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి కుంకుమార్చన కార్యక్రమం అనంతరం రాత్రికి లక్షదీపోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు హాజరై స్వామి వారి ఆరాధనోత్సవాల్లో పాలుపంచుకున్నారు. భక్తులు, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి దంపతులతో కలిసి దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తి భావం వెల్లివిరిసింది. దీపాలు వెలిగించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు స్వామివారి పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు చెప్పారు.

‘బీఆర్‌ఎస్ నాయకులను చేర్చుకోవద్దు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు రూరల్: బీఆర్‌ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంలో వనపర్తి నియోజకవర్గ నాయకులు ఒకసారి ఆలోచించాలని కాంగ్రెస్ పెబ్బేరు మండల నాయకులు కోరారు. శనివారం వారు మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో పెబ్బేరు, శ్రీరంగాపురం మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసినా పదేళ్లు పార్టీ నమ్ముకొని ఉన్నామన్నారు. కాంగ్రెస్ కష్ట కాలంలో ఉన్న సమయంలో కొద్దిమంది మాత్రమే జెండా పట్టుకొని 2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి రావడం కోసం పని చేశామని తెలిపారు. అప్పుడు లేని బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు మనకెందుకు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే బీఆర్‌ఎస్ నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడానికి క్యూ కడుతున్నారని, అలాంటి వారిని దగ్గరికి రానివ్వొద్దని వేడుకున్నారు. ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కలిసి చర్చించి, పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలని కోరారు. మీరు మారకపోతే పదేళ్లు ప్రతిపక్షంలో ఉండి, ఎన్నో కేసులతో ఇబ్బందులు పడ్డ తాము ఎంత వరకైనా వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గంధం రాజశేఖర్, రంజిత్‌కుమార్, దూపం సర్వేష్, కొత్తం దయాకర్‌రెడ్డి, బీరం రాజశేఖర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, ఆశన్న, సాయిగౌడ్, ఎద్దుల సతీష్, రంగస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి



పెబ్బేరు రూరల్: వేసవికాలం దృష్ట్యా పనుల వద్ద కూలీలకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించాలని ఎంపీడీఓ రవీంద్ర సూచించారు. మండలంలోని బూడిదిపాడు చెరువు, కుంటలో పూడికతీత పనులను శనివారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించి, కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని ఎఫ్ఏలకు సూచించారు. కూలీలు కొలతల ప్రకారం పని చేస్తే రూ.300 కూలి వస్తుందన్నారు. మండలంలో 2,450 మంది ఉపాధి పనులు చేస్తున్నారని తెలిపారు. టీఏలు నరసింహారెడ్డి, కార్యదర్శి ఉమాదేవి, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

క్రోధినామ సంవత్సర క్యాలెండర్ పంపిణీ



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను త్రైత సిద్ధాంత సేవాసమితి సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత సేవాసమితి మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థమయ్యే విధంగా క్యాలెండర్ రూపొందించినట్లు తెలిపారు. సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకాల సారముతో ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక పెబ్బేరు, కొత్తకోట సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తం, బాలకృష్ణ, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కోటమైసమ్మ ఉత్సవాలు



ఖిల్లాఘనపురం: పర్వతాపురం గ్రామంలో నిర్వహించిన కోటమైసమ్మ దేవత ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా శనివారం వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొని అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచు నిర్మల, గ్రామ పెద్దలు నాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుదర్శన్, బాలస్వామి, అంజనేయులుగౌడ్, మల్లేష్, ప్రతాప్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం ఆర్థికసాయం చేసినందుకు ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న పుల్గర్‌చర్ల గ్రామస్తులు

వీపనగండ్ల: గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం పుల్గర్‌చర్లకు చెందిన పలువురు మహిళలు, యువకులు పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా అవతున్న సమయంలో కొందరు మోటార్లను అమర్చి నీటిని లాగుతుండడంతో గ్రామంలోని కొందరికి నీరు అందడం లేదని వారు తెలిపారు. మరికొందరు నల్లాలో ఉన్న నియంత్రణ పరికరాన్ని తొలగించడం వల్ల ఎస్సీ కాలనీలోని కుటుంబాలకు సరిపడా నీరు అందడం లేదని వాపోయారు. వినతిపత్రం అందజేసిన వారిలో శశికపూర్, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, తిరుపతయ్య, కొయ్యనర్సింహ, కుమ్మమణ్యం, అనిల్, లక్ష్మి, సరోజ, చంద్రమ్మ తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవకు పురస్కారం



సిబ్బందికి ఉత్తమ పురస్కారాలు అందజేస్తున్న ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్‌రావు

ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి పురస్కారాలు లభించాయని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు సిబ్బంది సందీప్‌కుమార్‌రెడ్డి, భానుచందర్‌రెడ్డిలకు ఉత్తమ పురస్కారాలు అందించి, సత్కరించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాలకు తెగించి విధి నిర్వహణలో సిబ్బంది సేవలు అందిస్తారని కొనియాడారు. ఈసందర్భంగా స్థానికులకు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, నర్సింహారెడ్డి, రాముడు, వెంకటనర్సయ్య, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక శక్తులకు గుణపాఠం చెబుదాం

పాన్‌గల్: పార్లమెంటు ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీ పార్టీకి ఓటు ద్వారా గుణపాఠం చెబుతూ వామపక్ష, లౌకిక శక్తులను బలపర్చాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలో కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలు, రైతులు, కార్మికులను బీజేపీ మోసగించిందని దుయ్యబట్టారు. ఎన్నికల వేళ వికాసిత్ భారత్, సుస్థిర అభివృద్ధి, రామరాజ్యం స్థాపన వంటి నినాదాలతో మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు జిమ్మిక్కులు చేస్తుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వాల్మీకినాయుడు, కల్మూరీ వెంకటేష్, పులేందర్‌నాయుడు, కృష్ణ, చంద్రశేఖర్, బాలరాజ్, సుధాకర్, దశరథ తదతరులు పాల్గొన్నారు.

ఫ్రీ స్కూల్ ఎడ్యుకేషన్‌పై అవగాహన అవసరం



గ్రాడ్యుయేషన్ డే లో పాల్గొన్న చిన్నారులు

వనపర్తి టౌన్: ఫ్రీ స్కూల్ ఎడ్యుకేషన్‌పై అవగాహన అవసరమని జిల్లా అధికారిని లక్ష్మీబాయి, సీడీపీఓ కృష్ణచైతన్య అన్నారు. ఫ్రీ స్కూల్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని బసవన్నగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. ఫ్రీ స్కూల్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థుల్లో విద్యా చైతన్యం పెరుగుతుందని, తద్వారా తల్లిదండ్రులకు సైతం విద్యపై మరింత లోతైన అవగాహన అందించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, ప్రభుత్వ టీచర్ అనురాధ బాయి, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, విద్యులత, లావణ్య, ఏడబ్ల్యూహెచ్, విద్యార్థుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి

బిజినేపల్లి: వృద్ధాప్యంలో ఉన్న వారికి దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా ఉంటాయని, వారు అప్రమత్తంగా ఉండాలని యూత్ రెడ్ క్రాస్ జిల్లా కమిషనర్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లింగసానిపల్లిలో వృద్ధులకు సంచార వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయని, వేసవిలో వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కుమార్, వైద్య సిబ్బంది పద్మ, యాదమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న పి.ప్రశాంత్

కొత్తకోట: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీధర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పనిచేయాలని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పోతులపల్లి శ్రీనివాసులు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ఏవిధంగా కృషి చేశామో.. అదేవిధంగా పనిచేయాలని, ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పెంపు, 200యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఆగస్టు 15నాటికి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బోయేజ్, కృష్ణారెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మిషేక్, లతీఫ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సంద వెంకటేష్, రవీందర్‌రెడ్డి, లక్ష్మయ్యయాదవ్, క్రాంతికుమార్, శ్యామ్, కరాటే శ్రీను, రాజు, భాస్కర్, సాయిలు యాదవ్ ఉన్నారు.

‘గురుకుల’ విద్యార్థుల ప్రతిభ



జమ్మాపూర్ పీఎస్ విద్యార్థులతో ఎంఈఓ, పాఠశాల ఉపాధ్యాయ బృందం



కొన్నూరు పెద్దతండా పాఠశాల విద్యార్థులు



వీపనగండ్లలో..

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలల్లో మండలంలోని జమ్మాపూర్ యూపీఎస్ పాఠశాల నుంచి ఏకంగా 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వీరశేఖరాచారి శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు ఎంపికకావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను అభినందించారు. దీంతో పాటు మాధరావుపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి ఆరుగురు, వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని డఫోడిల్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు గురుకులలో 5వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో ఐదుగురు విద్యార్థులు సీట్లు సాధించడంపై పాఠశాల ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు. గురుకుల సీట్లు పొందిన వారిలో జయశ్రీ, సాత్విక్, సందీప్, భానుప్రకాష్, జయంత్ ఉన్నారు.

మదనాపురం: మండలంలోని కొన్నూరు పెద్దతండా పీఎస్ పాఠశాల నుంచి 5వ తరగతికి నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు సీట్లు సాధించారు. సంగీత, శివ, చరణ్, సువర్ణ, సింధు, స్వాతి, శివాని సీట్లు సాధించారని ఉపాధ్యాయులు తెలిపారు. హెచ్ఎం మదన్‌లాల్‌ను ఎంఈఓ కృష్ణయ్యతో పాటు తండావాసులు అభినందించారు. 2016 నుంచి 2024 వరకు ఈ పాఠశాల నుంచి 74 మంది విద్యార్థులు గురుకుల సీట్లు సాధించినట్లు హెచ్ఎం పేర్కొన్నారు.

ప్రధాని మోదీతోనే సుపరిపాలన సాధ్యం



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న నారాయణ



గుమ్మడంలో..

ఖిల్లాఘనపురం: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ జెండాను ఎగరవేద్దామని బీజేపి జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడితో పాటుగా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మండలంలో బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ మద్దతుగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఆదివారం నిర్వహించే ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ సెల్ అధ్యక్షుడు విక్ర రెడ్డి, మండల ఇన్‌చార్జ్ సీతారాములు, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్, సత్యనారాయణ, నాయకులు ఆశన్న, గోపి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: దేశంలో అవినీతి రహిత, సుపరిపాలన కేవలం ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందని బీజేపీ వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా శనివారం పెబ్బేరు మండలంలోని గుమ్మడంలో ఉపాధి పని ప్రదేశంలో కూలీలు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. మీ అమూల్యమైన ఓటు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నేతుల నారాయణ, నాయకులు ప్రకాష్‌శెట్టి, సాయికుమార్ ఆనందచారి, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.